ఎలగందల్ టైమ్స్
ప్రతి అక్షరం ప్రజల కోసం..
www.elagandaltimes.com
తెలుగు దినపత్రిక | కరీంనగర్ | గురువారం 06 జూన్ 2024 | పేజీలు 7



## చేతులెత్తేశారు...

- సిట్టింగ్ ఎమ్మెల్యేలకు భంగపాటు..
- పట్టు నిలుపుకోలేక పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్....
- ఆరు చోట్ల బీజేపీదే పైచేయి...

5



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మంత్రి పొన్నం ప్రభాకర్ సత్తా చాటుకున్నారు. కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో బీజేపీ సునామీ సృష్టించినా కూడా పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గమైన హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ తెచ్చి పెట్టడం విశేషం. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ రెండు, మూడో స్థానానికి పరిమితం కాగా ఒక్క హుస్నాబాద్ లోనే కాంగ్రెస్ పార్టీ బీజేపీపై 23 వేల ఓట్ల ఆధిక్యతను ప్రదర్శించింది. కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీని ఎంపీ బండి సంజయ్ కుమార్ నమోదు చేసినా కూడా హుస్నాబాద్ లో మాత్రం పట్టు దక్కకపోవడం కమలనాథులకు నిరాశను మిగిల్చింది. అటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. ఇటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో మెజారిటీని బీజేపీకి కట్టబెట్టి చేతులెత్తేసిన తరుణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన స్వంత నియోజకవర్గంలో సాధించిన మెజారిటీతో తన స్టామినా ఏమిటో మరోసారి చాటుకున్నారు. - కరీంనగర్, ఎలగందల్ టైమ్స్


# పొన్నమా... మజాకా...

**బీజేపీ హవాలోనూ ఆధిక్యత...**

- హుస్నాబాద్ లో కాంగ్రెస్ కు మెజారిటీ...
- ఆరు చోట్ల బీజేపీకే ఆధిక్యత...
- రెట్టింపైన కాంగ్రెస్ ఓట్లు...

4

---




## నీట్‌లో అల్ఫోర్స్ ప్రభంజనం..

- వందల బ్రాంచ్ లూ లేవు., వేల విద్యార్థులు లేరు.. అయినా అద్భుత ఫలితాలు..
- 2024 ఫలితాల్లో అఖండ విజయం
- పట్టుదలతోనే విజయ పరంపర..
- తల్లిదండ్రులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు..
- ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ డా.వి. నరేందర్ రెడ్డి

5



## బండికి శుభాకాంక్షల వెల్లువ..

జన జాతరలా పార్టీ ఆఫీసు..

లోపలి పేజీల్లో



## పర్యావరణాన్ని రక్షించాలి..

- పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి..
- చెట్లను నరకొద్దు..
- ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలి..
- కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి..
- కలెక్టర్ పమేలా సత్పతి
- చామనపల్లిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

........వివరాలు 3లో

# హైదరాబాద్ ఓటర్లకు ధన్యవాదాలు..

- ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్
- పార్లమెంట్ ఎన్నికలపై సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** దేశ పీడిత ప్రజల గొంతుక బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీని, ఐదవ సారి చరిత్రలో మైలురాయిలా తిరుగులేని మెజారిటీ అందించి అఖండ విజయాన్ని అందించిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజానీకానికి శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. గడచిన పది సంవత్సరాలలో దేశంలో దళిత, ముస్లింలపై, బడుగు, బలహీన వర్గాలపై, పీడిత తాడిత ప్రజలపై ఎప్పుడూ, ఎక్కడా దాడులు జరిగినా మానవ హక్కుల ఉల్లంఘన జరిగినా పార్లమెంటు వేదికగా గొంతెత్తి ప్రశ్నించే తత్వమున్న ఏకైక సెక్యులర్ నాయకుడు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. 5వసారి పార్లమెంటుకు హైదరాబాద్ ప్రజలు పంపించడం సంతోషదాయకమని చెప్పారు. కరీంనగర్ లో మోడీ చరిష్మా కంటే బీసీ, ఓసీల మధ్య వర్గ పోరు మాదిరిగా ఈ పార్లమెంట్ ఎన్నికలు జరిగాయన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సింపతి తో పాటు ఒక వర్గం ఓట్లను ధర్మం పేరిట ఏకం చేసి గెలవడంలో బిజెపి సఫలీకృతమైందని, నరేంద్ర మోడీ విఫలమైన పాలనను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించడంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడంతో ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో వెళ్లలేకపోయారని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో పకడ్బందీగా శ్రమించినట్లు, మిగతా చోట్ల ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పకడ్బందీగా పనిచేస్తే కాంగ్రెస్ బహుశా గెలిచి ఉండేది అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల క్రాస్ ఓటింగ్ తో బిజెపికి లాభం చేకూరిందన్నారు. ముస్లింలు ఒక్కటై ఓట్లు ఇతరులకు వేశారన్న వ్యాఖ్యలను ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఉపసంహరించుకోవాలని, పార్లమెంట్ ఎన్నికల్లో ముస్లింల ఓట్లు ఎన్ని, బండి సంజయ్ కు వచ్చిన మెజార్టీ ఎంత బేరీజు వేసుకోవాలన్నారు. ముస్లింల ఓట్లు ఎంపీ ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేయలేదని, కేవలం అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రమే ముస్లింల ఓట్లతో గెలుపోటములు ప్రభావితం అవుతాయని, ఈ అంశం ఎంపీకి తెలుసన్నారు. ప్రజలను కుల, మత, జాతి, వర్గ, లింగ విభేదాలు లేనటువంటి సమసమాజ స్థాపన కోసం, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం, ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా గెలిచినవారు పని చేయాలని సూచించారు. లేకుంటే కరీంనగర్ ప్రజలు రాబోయే రోజుల్లో మత వైశామ్యాలు రగిలించే వారికి కర్రు కాల్చి వాత పెడతారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో గులాం అహ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు.



## ఘనంగా పీపీ జన్మదిన వేడుకలు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ జిల్లా కోర్టు రెండవ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరెల్లి రాములు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగినాయి. బుధవారం కరీంనగర్ జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో రాములు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రామేశ్వరరావు, కొరివి వేణుగోపాల్ , కొత్త ప్రకాష్, సుధగోని జనార్దన్ గౌడ్, వాల మహేందర్ రావు, కొండూరి మహేందర్ గౌడ్, దాసరి రాంరెడ్డి, డి వి రమణ, మద్దికుంట కిషన్ రావు, గిన్నె సతీష్, బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్ బెజ్జంకి శ్రీకాంత్ రాములుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## అక్కన్నపేటలో సంబురాలు..

**సిద్దిపేట, ఎలగందల్ టైమ్స్:** బండి గెలుపును పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్చేరువు తండాలో సంబురాలు జరిపారు. గిరిజన మోర్చా మాజీ మండలాధ్యక్షుడు భానోతు అనిల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టపాసులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా లు, తీసుకున్న నిర్ణయాలే మరోసారి ప్రధాని మోడీ, ఎంపీ బండి సంజయ్ గెలుపుకు నాంది పలికాయన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని మోడీ నాయకత్వంలోనే సాధ్యమన్నారు. ఎంపీగా బండి సంజయ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. బండి ని గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఘనంగా ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు

**చొప్పదండి, ఎలగందల్ టైమ్స్:** చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గంగాధర క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో 30 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. శుభమస్తు ఫంక్షన్ హాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు భోజనం ఏర్పాటు చేశారు. నియోజకవర్గం లోని గ్రామ గ్రామాన ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.



## గోవంశ రక్షణ పోస్టర్ల ఆవిష్కరణ

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో గోరక్ష విభాగం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. విభాగ్ గోరక్ష ప్రముఖ్ వుట్కూరి రాధాకృష్ణ రెడ్డి గోవంశరక్షణ సంవర్దన సమితి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఎంపీ బండి సజయ్ మాట్లాడుతూ 1977 గోరక్షణ చట్టాని అమలుపరిచి గోమాతలను రక్షించాలని చెప్పారు. కార్యక్రమం లో ప్రాంత సేవా ప్రముఖ్ కోమళ్ళ రాజేందర్ రెడ్డి, వీహెచ్ పీ జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, జిల్లా సహకార్యదర్శి తోట రాజేందర్, ధర్మ ప్రసార్ విభాగ్ భాధ్యులు విడటలాచారి , రేపల్లి లింగ మూర్తి, బాలరాజ్, దూడం మహేష్, బట్టు వెంకటేష్ పాల్గొన్నారు.





## అగ్నిపథ్ లో ఎస్వీజేసీ ద్రోణాచార్య డిఫెన్స్ హవా

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ లోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కాలేజెన్ ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమీలో చదువుతున్న విద్యార్థులు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అగ్నిపథ్ ఆర్మీ ప్రవేశ రాత పరీక్షలో సత్తా చాటారు. సుమారు 20 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అంతా ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులంతా ఉత్తీర్ణులైన సందర్భంగా విజయోత్సాహం లో భాగంగా ఎస్.వి.జె.సి ద్రోణాచార్య డిఫెన్స్ అకాడమీ చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ పంగళ సంతో రెడ్డి అకాడమీలో సంబురాలు జరిపారు. అకాడమీలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి శిక్షణ ఇవ్వడానికి 1600 మీటర్ల మైదానం కలిగి ఉందని, ఫిజికల్ పరీక్షలకు సంబంధించి తమ బ్రుందం తగిన శిక్షణ సదుపాయలు కల్పిస్తోందన్నారు. విద్యార్థుల ఉన్నతే కళాశాల ఉద్దేశం అని ద్రోణాచార్య డిఫెన్స్ అకా డమీ యాజమాన్యం తెలిపింది. 100 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, తల్లితండ్రులను చైర్మన్, డైరెక్టర్లు సత్కరించారు.

## ఎంపీ ఆఫీసులో జనజాతర

### బండి సంజయ్ కు అభినందనల వెల్లువ



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ను కలిసి అభినందించేందుకు ప్రజలు, కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రం నలుమూలల నుండి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఎంపీ కార్యాలయం సందడిగా మారింది. ఉదయం నుండే జన జాతర మొదలైం ది. పొద్దున్నే సంజయ్ నివాసం వద్దకు భారీగా జనం తరలివచ్చారు. అక్కడి నుండి ఎంపీ కార్యాలయానికి వచ్చిన బండి సంజయ్ ను మధ్యాహ్నం వరకు విరామం లేకుండా ప్రజలు, నాయకులు కలిసి శాలువా కప్పి, పూల బొకేలు అందించి అభినందనలు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి సైతం రాష్ట్ర నాయకులు తరలి వచ్చి సంజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షు లు అఫ్సర్ పాషా, జనగాం జిల్లా అధ్యక్షులు దశ మంత్ రెడ్డితోపాటు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం, యాదవ, గౌడ, మున్నూరుకాపు, దళిత, బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంజయ్ ను కలిసి అభినందనలు తెలిపారు. జనం తాకిడితో ఎంపీ కార్యాల యం జాతరను తలపించింది. ఉదయం నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎంపీ కార్యాలయంలోనే ఉన్న బండి సంజయ్ సాయంత్రం హైదరాబాద్ వెళ్లారు.




## బండి సంజయ్‌కి రెడ్ క్రాస్ సొసైటీ శుభాకాంక్షలు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చిదుర సురేష్, ట్రెజరర్ పోరెడ్డి శ్రీహరి రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డా. ఏం.ఏల్.ఏన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




**వీడియో జర్నలిస్ట్ నరేష్ ని ఎంపీ బండి సంజయ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నరేష్ కు మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని డాక్టర్లకు సూచించారు.**

-కరీంనగర్, ఎలగందల్ టైమ్స్



## సుబ్రహ్మణ్య స్వామికి ఫలపంచామృతాభిషేకం

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కృతికా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలోని ఉమాసుతుడైన శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫల పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి, వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ స్వామికి విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి నూతన వస్త్రాలంకరణ చేసి విశేష హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు. భక్తులు పాల్గొన్నారు.



## బండికి శుభాకాంక్షలు..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన బండి సంజయ్ కి బీసీ సంక్షేమ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కరీంనగర్ లోని బీజేపీ కార్యాలయంలో బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సంజయ్ ను శాలువా కప్పి వేంకటేశ్వర స్వామి ప్రసాదం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో బీసీ కుల గణన చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీ సంజయ్ సానుకూలంగా స్పందిస్తూ పై విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకు వెళతానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రకాష్, జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ , జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి , యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళా మోర్చా ఆధ్వర్యంలో..



మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. శిల్పా రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్ పాషా, కార్యకర్తలు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్ ను ఎంపీ కార్యాలయం లో కలిసి సన్మానించారు.

## సంజయ్‌ను సన్మానించిన నేతలు..



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** రెండో సారి కరీంనగర్ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థిగా గెలుపొందిన సందర్భంగా పార్లమెంట్ కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ ను బిజెపి నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నరహరి లక్ష్మారెడ్డి, కొరిటాల శివరామకృష్ణయ్య మాట్లాడుతూ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న పక్కా లోకల్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గతంలో కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యావరణాన్ని రక్షించాలి..

- పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి..
- చెట్లను నరకొద్దు..
- ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలి..
- కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి..
- కలెక్టర్ పమేలా సత్పతి
- చామనపల్లిలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి హాజరు



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, తద్వారా మానవాళికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరూ పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాలు తలుచుకుంటే ఏ పనైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నో సంవత్సరాలుగా పెంచిన చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికి వేయవద్దని, చిన్నపిల్లలను పెంచినట్లు చూసుకోవాలని పేర్కొన్నారు. పొలాల్లో వరి కొయ్యలను కాల్చి వేయవద్దని, ఇలా చేస్తే చెట్లు దెబ్బతింటాయని తెలిపారు. చెట్లతోనే మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూరుతున్నదని చెప్పారు. ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఇంకుడు గుంతలు, మరుగు దొడ్లు నిర్మించుకోవాలని, పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ గ్రామాల్లో చెత్తను పడేయవద్దని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధి హామీ పథకం ద్వారా అనేక పనులు నిర వ్రహిస్తున్నామని పేర్కొన్నారు. కుక్కలు, కోతులపై దయ చూపాలని, వాటికి తగిన ఆహారం అందించాలని సూచించారు. ప్రజలందరం కలిసి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ప్రతి ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాలని, అలాగే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టాలని, ఉపాధి పనులను కూలీలు ఉపయోగించుకోవాలని సూచించా రు. సమావేశంలో డీఆర్డీఓ శ్రీధర్, డీపీఓ రవీందర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎంపీడీవో సంజీవ రావు, ఎంపీఓ జగన్మోహన్ రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభారాణి, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# బండి గెలుపుతో బీసీ సంఘాల్లో నూతన ఉత్తేజం

### బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గెలుపుతో బీసీ సంక్షేమ సంఘంలో ఆనందాలు వెల్లువెత్తాయి. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ ఆధ్వర్యంలో పలువురు బీసీ నేతలు బుధవారం బండి సంజయ్ ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ పార్లమెంటు స్థానాన్ని అన్ని పార్టీలు బీసీలకు కేటాయించాలని పలుమార్లు వినతి పత్రాలు అందజేసి డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కేవలం బీజేపీ మాత్రమే బీసీ అభ్యర్థికి సీటు కేటాయించింది. దానితో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్ నేతృత్వంలో కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని కుల సంఘాలు, బీసీ సంఘాలను పార్టీలకతీతంగా ఏకమై బీసీ అభ్యర్థి సంజయన్నను భారీ మెజరిటీతో గెలిపించుకోవాలని పార్లమెంట్ పరిధి వ్యాప్తంగా శ్రమించి, బీసీ అభ్యర్థి బండి విజయంతో బీసీ సంఘాలలో, బీసీ నాయకులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. అంతేకాకుండా బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ తో పాటు ముగ్గురు బీసీ అభ్యర్థులు గెలవడం చాలా సంతోషకరమని ప్రకాష్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంటులో బీసీ అభ్యర్థిగా రెండోసారి భారీ మెజరిటీతో గెలిచిన సంజయ్ కి కేంద్ర మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి. రాష్ట్రం నుండి గెలిచిన బీసీ పార్లమెంట్ అభ్యర్థులు బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేలా, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుకు కృషి చేయాలని, జనాభా లెక్కల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరుపాలని సంజయ్ ని కలిసిన బీసీ సంఘాలు కోరాయి.



## కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

### ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని, జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్ విద్యాధికారిని కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్,మచ్చ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేసి జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించి, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేద విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కళాశాలలు అభివృద్ధి పరచాలని కోరారు. అనుమతి లేని కళాశాల పై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ కళాశాలలు బలోపేతానికి క్రుషి చేయకుంటే ఏఐఎస్ఎఫ్ కార్యాచరణ సిద్ధం చేసుకుని దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యను కాపాడి అనుమతి లేని ప్రైవేట్ కళాశాలలు మూసి వేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపెల్లి హేమంత్, జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి..

### ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఆదిత్య జూనియర్ కళాశాలలో క్లాసులు ఆకాష్ జూనియర్ కళాశాలలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, విద్యార్థులను తప్పుదారి పట్టిస్తు మోసం చేస్తున్న ఆదిత్య కళాశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలి ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బోనగిరి మహేందర్, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ కరీంనగర్ లో ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గర రేకుర్తి దారిలో ఆదిత్య జూనియర్ కళాశాల యజమాన్యం పూర్తిగా విద్యార్థులను తప్పుదారి పట్టిస్తూ అడ్మిషన్లు మాత్రం కళాశాల పేరు మీద రిసిప్ట్ కట్ చేసి స్పెన్సర్ షాపింగ్ మాల్ లో గల ఆకాష్ జూనియర్ కళాశాలలో తరగతులను నిర్వహిస్తోందన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తున్నా ఇంటర్మీడియట్ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కళాశాల ఎక్కడ ఉంటే అక్కడ తరగతులు నిర్వహించాలేగానీ ఒక కళాశాల విద్యార్థులు మరో కళాశాలలో తరగతులు నిర్వహించడం నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కడ మేనని వెంటనే కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. బోర్డ్ అధికారులు ఆకాష్ జూనియర్ కళాశాల లో తరగతులు నిర్వహిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదిత్య, ఆకాష్ జూనియర్ కళాశాలల ముందు ఆందోళన నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పొన్నమా.. మజాకా..

- బీజేపీ హవాలోనూ ఆధిక్యత...
- హుస్నాబాద్ లో కాంగ్రెస్ కు మెజారిటీ...
- ఆరు చోట్ల బీజేపీకే ఆధిక్యత...
- రెట్టింపైన కాంగ్రెస్ ఓట్లు...

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మంత్రి పొన్నం ప్రభాకర్ సత్తా చాటుకున్నారు. కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలో బీజేపీ సునామీ సృష్టించినా కూడా పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గమైన హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ తెచ్చి పెట్టడం విశేషం. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ పార్టీ రెండు, మూడో స్థానానికి పరిమితం కాగా ఒక్క హుస్నాబాద్ లోనే కాంగ్రెస్ పార్టీ బీజేపీపై 23 వేల ఓట్ల ఆధిక్యతను ప్రదర్శించింది. కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీని ఎంపీ బండి సంజయ్ కుమార్ నమోదు చేసినా కూడా హుస్నాబాద్ లో మాత్రం పట్టు దక్కకపోవడం కమలనాథులకు నిరాశను మిగిల్చింది. అటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. ఇటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో మెజారిటీని బీజేపీకి కట్టబెట్టి చేతులెత్తేసిన తరుణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన స్వంత నియోజకవర్గంలో సాధించిన మెజారిటీతో తన స్టామినా ఏమిటో మరోసారి చాటుకున్నారు.

కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినా మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలో మెజారిటీ దక్కడం పార్టీ శ్రేణులకు ఊరటనిస్తోంది. కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ ఇన్ చార్జిగా ఆది నుంచి చివరి వరకు అంతా తానై వ్యవహరించినా కూడా ఫలితం పొన్నం ప్రభాకర్ కు నిరాశను మిగిల్చినా తన నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండటంపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దం తర్వాత కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని పొన్నం ధీమాను కనబరుస్తూ వచ్చినా అంచనాలను తలక్రిందులు చేస్తూ బీజేపీ ఓట్ల సునామీతో మరోసారి విజయం దక్కించుకున్నది. 2009లో కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి గెలుపొందిన పొన్నం ప్రభాకర్ 2014, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2019లో కాంగ్రెస్ పార్టీ 3వ స్థానానికే పరిమితమైంది. ఈసారి కూడా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ లోక్ సభ స్థానానికే పోటీ చేయడం ఖాయమని అందరూ భావించినా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన చివరి నిముషంలో పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపి ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో అక్కడ



టికెట్టు ఆశించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డికి నచ్చజెప్పి పొన్నం ప్రభాకర్ బరిలోకి దిగారు. వరుసగా రెండుసార్లు ఇక్కడ నుంచి విజయం సాధించిన బీఆర్ఎస్ నేత వొడితెల సతీష్ కుమార్ ను ఓడించి పొన్నం ప్రభాకర్ 19, 344 ఓట్ల మెజారిటీతో గెలుపొంది సంచలనం సృష్టించారు. బీసీ నేతగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న పొన్నం ప్రభాకర్ కు ప్రభుత్వంలో కీలక శాఖలు దక్కాయి. ఈ నేపథ్యంలో వచ్చిన లోక్ సభ ఎన్నికల్లో కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గ పార్టీ ఇన్ చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

### 23 వేల ఆధిక్యత...

బీజేపీ హవా కొనసాగిన నేపథ్యంలో లోక్ సభ పరిధిలోని అన్ని చోట్ల బీజేపీపై ఆధిక్యత లభిస్తుందని అంచనా వేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంపై కూడా బీజేపీ నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఫలితాల లెక్కింపు అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇక్కడ 23,128 ఓట్ల మెజారిటీని సాధించడం గమనార్హం. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి 79,001 ఓట్లు రాగా బీజేపీకి 55, 873 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ కు 41, 295 ఓట్లు మాత్రమే దక్కడంతో కాంగ్రెస్ పట్టును మరోమారు చాటుకున్నది.

### వెలిచాల కోసం పట్టు...

కరీంనగర్ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి పోటీ చేసేందుకు ముందుకు రాగా సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు ఆయనకు మద్దతునిచ్చారు. తీన్మార్ మల్లన్న కూడా కరీనంగర్ నుంచి పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరికి టికెట్టు ఖాయమంటూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రచారం జరిగినా పొన్నం ప్రభాకర్ మాత్రం మొదటి నుంచి వెలిచాల రాజేందర్ రావు అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపారు. రాజేందర్ రావుకు టికెట్టు కట్టబెట్టడంలో పొన్నం ప్రధాన భూమిక పోషించారు. ఏఐసీసీ నేతలను ఒప్పించారు. అయితే ఖమ్మం, హైదరాబాద్ అభ్యర్థిత్వాలతో ముడిపడి ఉండటంతో చివరి వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ నుంచి బండి సంజయ్ బీఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్ ఒకవైపు ముమ్మరంగా ప్రచారం కొనసాగించుకుంటుండగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాత్రం తమ అభ్యర్థి ఎవరో తెలియక తికమక పడ్డారు. నామినేషన్ల పర్వం ముగింపు వరకు కూడా అభ్యర్థిని తేల్చకపోవడం కాంగ్రెస్ పార్టీకి తీవ్ర దెబ్బగా భావించారు. ఒకవైపు మండుటెండలు..మరోవైపు అభ్యర్థిత్వం ఖరారులో జాప్యం మరింత ఇబ్బందికరంగా మారింది. ఎట్టకేలకు అభ్యర్థిని ప్రకటించినా పొన్నం చూపిన చొరవ కారణంగా కాంగ్రెస్ పార్టీ టాప్ గేరులోకి వచ్చింది. వరుస సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగులు, కుల సంఘాలతో భేటీలతో కాంగ్రెస్ పార్టీ ముమ్మర ప్రచారం కొనసాగించింది. గెలుపుపై బీజేపీ గట్టి ధీమాతో ఉన్నా కూడా కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా గట్టి పోటీనిచ్చి సత్తా చాటుకునే ప్రయత్నం చేయగా మొత్తం వ్యవహారంలో పొన్నం ప్రభాకర్ క్రియాశీల పాత్ర పోషించారనే చెప్పవచ్చు.

### రెండో స్థానానికి చేరిన కాంగ్రెస్ ...

కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గానికి 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడవ స్థానానికి పరిమితమైంది. ఇక్కడ బీజేపీకి 4, 98, 276 ఓట్లు రాగా టీఆర్ఎస్ కు 4, 08, 768 ఓట్లు వచ్చాయి. మూడవ స్థానానికి పరిమితమైన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ కు కేవలం 1, 79, 258 ఓట్లు మాత్రమే దక్కాయి. అయితే ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ ధీటైన అభ్యర్థిని బరిలో నిలుపడం అధికారాన్ని కోల్పోవడంతో బీఆర్ఎస్ బలహీనపడటం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుంది. దీంతో తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 3, 56, 737 ఓట్లు సాధించడం ద్వారా రెండుస్థానానికి చేరుకుంది. బీఆర్ఎస్ కు 2, 80, 564 ఓట్లు మాత్రమే రాగా గత ఎన్నికలతో పోలిస్తే లక్షకు పైగా ఓట్లను కోల్పోయిందని తెలుస్తోంది.



## కలెక్టర్ పమేలా సత్పతికి శుభాకాంక్షలు..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** ఓటు విలువను అందరికీ తెలియజేస్తూ ఓటును హక్కును వినియోగించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించిన కలెక్టర్ పమేలా సత్పతిని టీఎన్జీవోల జిల్లా సంఘం, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించిన జిల్లా అడ్మినిస్ట్రేషన్ కు, అవకతవకలు లేకుండా కౌంటింగ్ నిర్వహించిన సిబ్బందికి పోలీసు యంత్రాంగాన్ని కోఆర్డినేట్ చేసుకుని శాంతి భద్రతలు కాపాడిని సిపి అభిషేక్ మహంతి కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించిన ప్రతి ఉద్యోగికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, అసోసియేటర్ అధ్యక్షులు రాగి శ్రీనివాస్, కోశాధికారి కిరణ్ కుమార్, అధ్యక్షులు సర్దార్ హర్మేందర్ సింగ్, రూరల్ అధ్యక్షులు రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి నేరేళ్ళ కిషన్, జిల్లా నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వరరావు, సబిత, సునీత, సేవ్యా నాయక్, జీవన్ రెడ్డి, టీజీవో నాయకులు కాళిచరణ్, సుధాకర్, అజయ్ కుమార్, మన మీత్ సింగ్, లవ కుమార్, రజనీకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇండియా కూటమిదే నైతిక విజయం..

**ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్...**

కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ : పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో ఇండియా కూటమిదే నైతిక విజయం అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం ప్రెస్ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజామిత్ర మొదటి నుంచి దేశానికి ఇండియా కూటమి, కూటమిలోని పార్టీలైన కాంగ్రెస్, సమాజ్ వాది పార్టీ, తృణముల్ కాంగ్రెస్, నేషనల్ లిస్ట్ కాంగ్రెస్ పార్టీ, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకత్వం అవసరం ఉన్నదని చెప్తూ వస్తోందన్నారు. అన్నట్టుగానే ఎన్డీఏ కూటమికి 293 సీట్లు, ఇండియా కూటమికి 223 సీట్లు వచ్చాయన్నారు. గతంలో ఇండియా కూటమికి 300 సీట్లు వస్తాయని చెప్పామని, 70 సీట్ల తారుమారు కేంద్ర ప్రభుత్వం నిర్బంధమే కారణమన్నారు. రెండు రాష్ట్రాలలో ముఖ్యమంత్రులపై ఒత్తిడి సృష్టించిందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఇండియా కూటమికి సీట్లు తగ్గాయని, లేకుంటే ఇండియా కూటమే దేశంలో అధికారంలోకి వచ్చేది అన్నారు. అయినా కూడా ఒక బలమైన ప్రతిపక్ష పాత్రను పోషించే స్థాయిలో ఉందన్నారు. బిఆర్ఎస్ కు మాత్రం గుండు సున్నా ఇచ్చి కేసీఆర్, కేటీఆర్ ల అహంకారాన్ని నిలువరించారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం 1996 లో గద్దర్ సారథ్యంలో భువనగిరి సభతో ప్రారంభమై తెలంగాణ మహాసభ, తెలంగాణ జన సభ తెలంగాణ ఐక్యవేదికలు లాంటి సంస్థలు ఆవిర్భవించాయన్నారు. సమావేశంలో బోయిన్పల్లి చంద్రయ్య, బాపు రెడ్డి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.




## మొక్కలతోనే పర్యావరణం..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ స్వాధార్ హోమ్ లో న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. వాతావరణం లో వస్తున్న మార్పులకి వృక్షాలని నిర్లక్ష్యం చేయడమే అన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తో పాటు లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, స్వాధార్ హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాన్ని పుట్టబోయే పిల్లల్నీ ఆరోగ్యంగా రక్షించుకోవాలన్నా, మనం పీల్చే శ్వాస స్వచ్ఛంగా రావాలన్నా ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటి వృక్షంగా మారే వరకూ పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. రాబోయే సమాజాన్ని కాపాడడంలో మనమంతా భాగస్వామ్యం కావాలన్నారు. పిల్లలకు ప్రతి రోజు మొక్కలకు నీళ్లు పోసేలా అలవాటు చేయాలన్నారు. మనం మన పర్యావరణాన్ని రక్షించుకుంటే ఆ పర్యావరణం మనల్ని రక్షిస్తుందనిపేర్కొన్నారు. పర్యావరణాన్ని చెడగొట్టేలా చెట్లు కత్తిరించడం, మొక్కలు నాటకపోవడం, ప్లాస్టిక్ వాడడం వల్ల ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే కాలుష్యం



పెరిగి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు సంఖ్య పెరిగి మరణాల సంఖ్య పర్యావరణం కారణంగా పెరుగుతుందన్నారు. తెలంగాణలోని ప్రతి ఒక్కరు రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపి పర్యావరణాన్ని రక్షించుకొని కాలుష్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని సూచించారు.



## పవన్ కళ్యాణ్ గెలుపుపై సంబురాలు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** జనసేన పార్టీ కరీంనగర్ నాయకులు అజయ్ బబ్లుగౌడ్, కరుణాకర్ ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తోపాటు జనసేన అభ్యర్థులందరూ గెలవడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కరీంనగర్ లోని నగరం నడిబొడ్డున తెలంగాణ చౌక్ వద్ద జనసేన కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి మెగా అభిమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలుపల వెంకటేష్, సాయి ధరంతేజ్ రాష్ట్ర అధ్యక్షుడు కాసా రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే జనసేన కార్యకర్తలు, మెగా బ్లడ్ డోనర్ కుమార్ శివ, మెగా నరేష్, వివేక్, సాయి కుమార్, మహేష్ పాల్గొన్నారు.

## నీట్ లో బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

**అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యార్థులు ఈ ఏడాది నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి రికార్డు సృష్టించారు. 171 మంది పరీక్ష రాయగా వారిలో 135 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో 120 మంది బాలికలు, 15 మంది బాలురు ఉన్నారు. ఏడుగురు అమ్మాయిలు, ఏడుగురు అబ్బాయిలు 400లకు పైగా మార్కులు సాధించారు. అబ్బాయిల్లో ఎం.చందు- 680 (33వర్యాంక్), ఎస్.వినీత్ రెడ్డి- 652 (3410 ర్యాంక్), కె. రమేష్- 630 (22,083-ర్యాంక్), ఎం. లక్ష్మణ్ - 498, టి.పవన్ - 473 మార్కులు సాధించగా అమ్మాయిల్లో ఎం. మానస (488), బి.రిషిత (437), బి. నాగలక్ష్మి (433), పి. సుస్మిత(429), బి. హర్షిత(424) బి. అనుష (419), ఎం. స్ఫూర్తి (394), ఎంబీబీఎస్ కు అర్హత సాధించారు. మరో 25మంది బీడీఎస్ కోర్సులో చేరేందుకు అర్హత సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, బోధనా సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, బోధన సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ గురుకుల సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు, ఐ ఎఫ్ ఎస్ తదితరులు అభినందించారు.

# చేతులెత్తేశారు...

- సిట్టింగ్ ఎమ్మెల్యేలకు భంగపాటు..
- పట్టు నిలుపుకోలేకపోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్..
- ఆరు చోట్ల బీజేపీదే పైచేయి...

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** ఇద్దరు మాజీ మంత్రులు.. నలుగురు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు...ఆరు నెలలు తిరగకముందే తమ పట్టును నిలుపుకోలేక చేతులెత్తేశారు. బీజేపీ సునామీలో కొట్టుకుపోయారు. సంక్షేమ పథకాల పేరుతో కాంగ్రెస్ ... వ్యతిరేకత పేరిట బీఆర్ఎస్ ఈసారి తమదే పైచేయిగా నిలుస్తుందంటూ ధీమాను ప్రదర్శిస్తూ వచ్చినా తీరా ఓట్ల లెక్కింపుతో ముగ్గురు కాంగ్రెస్ .. ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖంగుతినక తప్పలేదు. నాలుగుసార్లు విజయాన్ని దక్కించుకున్న కేటీఆర్, గంగుల కమలాకర్ కూడా తమ నియోజకవర్గాల్లో బీజేపీ హవాను అడ్డుకోలేకపోవడం గమనార్హం. మొత్తానికి కరీంనగర్ నుంచి రికార్డు మెజారిటీతో విజయాన్ని నమోదు చేసిన బండి సంజయ్ కుమార్ తాజాగా సిట్టింగ్ ఎమ్మెల్యేల ముందు సరికొత్త సవాళ్ళను విసిరినట్లేనని భావిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మినహా మిగిలిన వారెవరూ తమ నియోజకవర్గాల్లో ప్రత్యర్థిని కట్టడి చేయలేకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మెజారిటీ కూడా భారీగా బీజేపీకి దక్కడం నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తో కాకుండా బీజేపీ నుంచే గట్టి పోటీని ఎదుర్కొనక తప్పదన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

### కరీంనగర్ లో బీఆర్ఎస్ కుదేలు...

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, కొత్తపల్లి మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ కూడా గులాబీ చేతిలోనే ఉంది. మైనారిటీల మద్దతు తమకేనని ధీమాను వ్యక్తం చేశారు. తీరా ఓట్ల లెక్కింపు తర్వాత ఆ పార్టీ నేతల కళ్ళు బైర్లు కమ్మాయి. 2, 22, 123 ఓట్లు పోల్ కాగా బీజేపీకి 1,23, 127 ఓట్లు రాగా.. కాంగ్రెస్ పార్టీ 63, 755 ఓట్లను దక్కించుకున్నది. బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమై 29, 334 ఓట్లతో సరిపెట్టుకోగా బీజేపీ 59, 372 ఓట్ల మెజారిటీని సాధించి కరీంనగర్ పై పట్టును నిలుపుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బండి సంజయ్ స్వల్ప తేడాతోనే ఓటమిపాలైన విషయం తెలిసిందే.






### చొప్పదండిలో కాంగ్రెస్ కు షాక్...

చొప్పదండి ఎస్సీ రిజర్వ్ డ్ నియోజకవర్గం నుంచి ఇటీవల యువనేత మేడిపల్లి సత్యం కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. మంచి మెజారిటీతో గెలుపొందిన ఆయన లోక్ సభ ఎన్నికల్లోనూ సత్తా చాటుతారని భావించారు. అయితే ఇక్కడ కూడా బీజేపీకి భారీ ఆధిక్యత రావడం కాంగ్రెస్ కు షాక్ గా మారింది. 1, 76, 165 ఓట్లు పోల్ కాగా బీజేపీకి 94, 992 ఓట్లు, కాంగ్రెస్ 41, 983 ఓట్లు రాగా 53, 009 ఓట్ల ఆధిక్యతను బీజేపీ సాధించింది. బీఆర్ఎస్ 26, 808 ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమైంది.

### డీసీసీ చీఫ్ కోటలోనూ అదే పరిస్థితి...

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కూడా చేదు అనుభవమే ఎదురైంది. తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికైన కవ్వంపల్లి తన నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కి మెజారిటీ ఇవ్వడం ఖాయమని ప్రచారం జరిగింది. అయితే ఇక్కడ 1, 75, 228 ఓట్లు పోల్ కాగా 77, 282 ఓట్లు బీజేపీ సాధించగా కాంగ్రెస్ 52, 769 ఓట్లకే పరిమితం కావడంతో బీజేపీకి 24, 513 ఓట్ల ఆధిక్యత దక్కింది. బీఆర్ఎస్ 32, 095 ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమైంది.

### కేటీఆర్ ఇలాకాలో కమల వికాసం...

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2009 నుంచి సిరిసిల్లలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ కు మెజారిటీ దక్కుతుందని భావించగా ఇక్కడ కూడా బీజేపీ స్వల్ప మెజారిటీని దక్కించుకోవడం గమనార్హం. 1,85,573 ఓట్లు పోల్ కాగా 72, 559 ఓట్లు బీజేపీకి రాగా బీఆర్ఎస్ 65,811 ఓట్లకే పరిమితం కావడంతో 6748 ఓట్ల మెజారిటీ బీజేపీకి దక్కింది. కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా 33, 610 ఓట్లతో మూడవ స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది.

### వేములవాడలోనూ బీజేపీ హవా...

వేములవాడ నియోజకవర్గంలో 1, 68, 336 ఓట్లు పోల్ కాగా బీజేపీ 81, 714 ఓట్లు దక్కించుకుంది. బీఆర్ఎస్ ఇక్కడ 38, 142 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ 36, 022 ఓట్లకు పరిమితం కావడంతో బీజేపీకి 43, 572 ఓట్ల ఆధిక్యత లభించింది. ఈ నియోజకవర్గంలో ఇటీవలే కాంగ్రెస్ పార్టీ నుంచి ఆది శ్రీనివాస్ గెలుపొందారు. బీఆర్ఎస్ నుంచి చల్మెడ లక్ష్మినర్సింహారావు ఇక్కడ గట్టి పట్టుదలతో బీఆర్ఎస్ విజయం కోసం శ్రమించడంతో కాంగ్రెస్ పార్టీకి మించి ఓట్లను దక్కించుకోగలిగారని తెలుస్తోంది.

### హుజురాబాద్ లో కౌశిక్ కు చెక్...

దూకుడుగా వ్యవహరించే పాడి కౌశిక్ రెడ్డికి హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు ఆరు మాసాలు తిరిగే సరికి చెక్ పెట్టారు. ఇక్కడ 1,84, 170 ఓట్లు పోల్ కాగా బీజేపీకి 73, 280 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీ 50, 306 ఓట్లను దక్కించుకోవడంతో బీజేపీ 22, 974 ఓట్ల మెజారిటీ పొందింది. బీఆర్ఎస్ కు ఇక్కడ 47, 379 ఓట్లతో మూడవ స్థానానికి పరిమితం కావడం గమనార్హం.

# నీట్‌లో అల్ఫోర్స్ ప్రభంజనం..

- వందల బ్రాంచ్ లూ లేవు., వేల విద్యార్థులు లేరు.. అయినా అద్భుత ఫలితాలు..
- 2024 ఫలితాల్లో అఖండ విజయం
- పట్టుదలతోనే విజయ పరంపర..
- విద్యాసంస్థల చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** నీట్-2024 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించిందని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్. వి నరేందర్ రెడ్డి తెలిపారు. నీట్ కోచింగ్లో డాక్టర్-30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ ను గ్న దించిన రెండో సంవత్సరంలో ఆల్ఫోర్స్ విజయపరంపర కొనసాగుతోందన్నారు. 10 మంది విద్యార్థులు 600 ఆపై మార్కులు, 20 మంది విద్యార్థులు 560 ఆపై మార్కులు, 41 మంది విద్యార్థులు 500 ఆపై మార్కులు, 86 మంది విద్యార్థులు 450 ఆపై మార్కులు సాధించారన్నారు. అందులో ఎన్.హేమంత్ 691, వి.హాసిని 671, డి.పూజిత 650, ఎన్.కౌశిక్ రెడ్డి 647, పి.అక్షర రెడ్డి 639, వి.శ్రీముఖి 619, మరియాసభ 619, ఏ.శ్రీవర్ధిని 613, ఎం.కమాలికా ప్రీతి 613, ఎన్.జ్ఞానద 604, ఏ.అమరేందర్ 598, బి.హాసిత 595, కె.శ్రీవిద్య 582, ఎండీ అఫ్జాన్ ఖాన్ 579, ఎన్.సాయి ప్రతిజ్ఞ 573, ఎం.ప్రతిమ 571, పి.శ్రీనాథ్ 566, షేక్ ఉమ్రా 561, తేజస్వీని 560, మహీన్ నజ్మీన్ 560 మార్కులు సాధించగా, కె.సుహృదాఘవ పీడబ్ల్యూడీ కేటగిరిలో జాతీయస్థాయిలో 675 వ ర్యాంకు సాధించినట్టు చెప్పారు. సుమారు 130 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలో సీట్లు సాధిస్తారన్నారు.

**పటిష్ట ప్రణాళికతోనే సాధ్యం..**

పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అకుంటిత దీక్ష, పట్టుదల కృషి తోనే ఇంతటి ఘన విజయం సాధ్యమైందని చైర్మన్ తెలిపారు. తక్కువ మంది విద్యార్థులతో అధికంగా సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనమని, నీట్, ఐఐటీ విద్యార్థులను విజయమార్గంలో నడిపిస్తున్న సంస్థ తమదన్నారు. ఇంతవరకు ప్రకటించబడిన అన్ని ఫలితాల్లో ముందంజలో ఉన్నాయన్నారు.




కాగా, తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న అల్ఫోర్స్ ను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ పిల్లలను చేర్పిస్తున్నందుకు వారికి మన స్ఫూర్తిగా కృతజ్ఞతాభినందనలు తెలుపుతున్నట్టు చెప్పారు. రాబోయే కాలంలో అత్యధిక మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి, ఎన్.ఐ.టిలలో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ ఆణిముత్యాలను అభినందించారు. ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రిలిమ్స్ పకడ్బందీగా నిర్వహించాలి..

- నిబంధనలపై అవగాహన ఉండాలి..
- తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దు..
- పకడ్బందీ చర్యలు తీసుకోవాలి..
- కలెక్టర్ పమేలా సత్పతి
- గ్రూప్-1 పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు శిక్షణ



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఈనెల 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను అధికారులు సక్సెస్ ఫుల్ గా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అభ్యర్థుల భవిష్యత్తు దృష్ట్యా చిన్న తప్పుకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్లోని మహిళా డిగ్రీ కళాశాలలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల సూపరింటెండ్లు, అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు టీజీపీఎస్సీ నిబంధన లను క్షుణ్ణంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆ మేరకు జాగ్రత్తగా గ్రూప్ –1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహిం చాలని సూచించారు. ఈ నెల 9న ఉదయం 9 గంటల వరకే పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుందని తెలిపారు. 10 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని చెప్పారు. ఉదయం 10:30 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రైవేటు కళాశాలల పరీక్ష కేంద్రాల్లో అనవసరమైన వ్యక్తులు పరీక్ష రోజున ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పకడ్బందీగా విధులు నిర్వర్తించా లని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష పూర్తయిన తర్వాత ఓఎంఆర్ షీట్లు, హాజరైన అభ్యర్థుల సంఖ్య తేడా రాకుండా చూసుకోవాలని, పరీక్షకు రెండు రోజుల ముందే సెంటర్ల దగ్గర ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొబైల్ ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లో అనుమతి లేదని తెలిపారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు సరిగా పని చేస్తున్నాయో లేదో చూసుకో వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీ శ్రీ లక్ష్మి, కొండగట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్ బీ సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.



## ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

**హుస్నాబాద్, ఎలగందల్ టైమ్స్:** రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మద్దతు తెలిపినందుకు హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం జాక్ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ అప్రజాస్వామిక పద్ధతిలో బిజెపికి సహకరించటం అత్యంత హేయమైన చర్యగా ఖండించారు. తెలంగాణను అన్ని రంగాల్లో నిర్వీర్యం చేయడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి తొత్తుగా మారడం యావత్ తెలంగాణ ప్రాంతం గమనించిందన్నారు. రాబోయే కాలంలో బడుగు బలహీన వర్గాల వారు బిజెపి కుట్రలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీరన్న నాయక్, రాజగోపాల్ రావు, కేడం లింగమూర్తి, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్ బంక చందు మార్క అనిల్ గౌడ్,నాంపల్లి సమ్మయ్య, మడప జయపాల్ రెడ్డి, దండి లక్ష్మి, ముత్యాల సంజీవరెడ్డి, పొన్నాల ఫ్రాన్సిస్, ఐలేని సంజీవరెడ్డి, ఐలేని మల్లారెడ్డి, ఉల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీ ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహస్వామికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా, తోక పేర్లతో నడుస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కేసులు నమోదు చేయాలని కోరారు. అనుమతి లేని పాఠశాలల వివరాలను విద్యాశాఖ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకొని వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా యూత్ అధ్యక్షులు దీకొండ కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

**ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య**




**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** రాష్ట్రంలోని మైనారిటీ కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కోరారు. కరీంనగర్ లోని బద్దంఎల్లారెడ్డి భవన్ లో మీరజ్ హుస్సేన్ అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య మాట్లాడు తూ ప్రభుత్వ మోడల్ స్కూల్లో వివిధ విభాగాల్లో పనిచేసే నాన్ టీచింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈపీఎఫ్ , ఇన్సూరెన్స్ సౌకర్యం అధికారుల వేధింపులు అరికట్టాలని కోరారు. 2024 –25 నూతన విద్య సంవత్సరంలో గతంలో పనిచేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, ఇప్పటి సర్కారైనా ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో ఏఐటిసి జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చయ్య యాదవ్, ఎలకపల్లి శ్రీకాంత్, మీరజ్ హుస్సేన్ ,స్రవంతి, నజీర్,స్వప్న అరుణ, హాయ్ రా బేగం ప్రవీణ్ సరస్వతి ఎస్.కె ఆనంద్ హమీద్, ఖలీల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా మైనార్టీ నాన్ టీచింగ్ కార్మికుల కన్వీనర్ గా ఎలుక పెల్లి శ్రీకాంత్, కోకన్వీనర్ గా మీరజ్ హుస్సేన్ తో పాటు 21 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్టు సమ్మయ్య చెప్పారు.



## సీఎంను కలిసిన ఎంపీలు..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కాంగ్రెస్ పార్టీ ఎంపీలుగా విజయం సాధించిన నాయకులు బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ కడి యం కావ్య, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని నాయకులు శాలువాలతో, జ్ఞాపికలతో సన్మానించారు. ఎంపీలుగా గెలిచిన నాయకులను, వారిని గెలిపించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేలను, ఇంఛార్జి మంత్రులు, నియోజక వర్గాల ఇంఛార్జిలను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.



## మాజీ సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే

**ఎర్రవెల్లి లోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం మాజీ సీఎం చంద్రశేఖర్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ .** -ఎలగందల్ టైమ్స్



# PEDDAKARMA



**Smt.SARVA POCHAMMA GARU**

**( 29-05-2024 )**

Celebrate her life and in her memory

**9th, Sunday, June, 2024**

**Time: 1 :00 PM**

## Venue :

Padmavathi function hall
Ramnagar karimnagar

Invitation
family members